క్లుప్తంగా

వేదరత్న బిరుదు ప్రదానం



హన్మకొండ అర్బన్: సర్ సీవీ.రామన్ అకాడమీ (సేవా సాంస్కృతిక సంస్థ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో హరిహర కళాభవన్‌లో ఆదివారం నిర్వహించి ఉగాది పురస్కారాల మహోత్సవంలో భాగంగా రాష్ట్రంలోని వివిధ రంగాల్లో నిష్ణాతులైన పలువురిని అకాడమీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అందులో భాగంగా నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి పద్మాక్షి దేవాలయ వేద పండితుడు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని సేవను గుర్తించి ఆయనను సువర్ణ ఘంటా కంకణం, వేదరత్న బిరుదుతో సత్కరించారు.

సినీహీరో సాయిదుర్గాతేజ్ ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా రవీందర్



ఖిలా వరంగల్: మెగా సుప్రీం హీరో సాయిదుర్గాతేజ్ యువత రాష్ట్ర అధ్యక్షుడిగా వరంగల్‌కు చెందిన నాంపల్లి రవీందర్ నియమితులయ్యారు. ఈమేరకు ఆయనకు అఖిల భారత సాయిదుర్గాతేజ్ యువత అధ్యక్షుడు కాస రాజు ఆదివారం నియామక పత్రం అందజేశారు.

విద్యాసాగర్‌రావుకు స్వాగతం



మడికొండ: వరంగల్ నగరానికి విచ్చేసిన మహారాష్ట్ర మాజీ గవర్నర్, బీజేపీ నేత సీహెచ్.విద్యాసాగర్‌రావుకు మడికొండ చౌరస్తాలో పార్టీ నాయకులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బన్న ప్రభాకర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గద్దం మహేందర్, నాయకులు పానగోటి వెంకట్‌రావు, దువ్వ నవీన్, బొల్లికొండ వినోద్, మహేందర్ పటేల్, నిఖిల్‌రావు, వస్కుల మౌలి, పిట్టల రమేష్, ఎలగొండ శివ, పల్లకొండ రాజేందర్, బైరి సతీష్, కుక్కల రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్‌లోని భవానీనగర్, బాలాజీనగర్‌లలో అభివృద్ధి పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. పనులను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆదివారం పరిశీలించారు. విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పందించి రూ.40 లక్షలు సీడీఎఫ్ నిధులు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు షేక్ అస్గర్, మైసారపు సిరిల్ లారెన్స్ తెలిపారు. కార్యక్రమంలో సిలువేరు విజయభాస్కర్, ఇప్ప శ్రీకాంత్, బిలాల్, భూషపాక శ్రీనివాస్, బర్ల రాజ్‌కుమార్, మాతంగి స్వామి, బండారి రాజేందర్, కొమురవెల్లి రమేష్, ఒగ్గుల భద్రయ్య పాల్గొన్నారు.

రైలులోనుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం

ఖిలా వరంగల్: ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారి కిందపడి ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడని రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ పరిధి నెక్కొండ రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం 35 – 45 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడగా మృతిచెందాడు. అతని చేతిపై పి.అశోక్ అని ఇంగ్లిష్‌లో పచ్చబొట్టు ఉంది. అతడి వద్ద సికింద్రాబాద్ నుంచి విజయవాడకు జనరల్ టికెట్ లభించింది. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపర్చారు. వివరాలకు 94415 57232, 87126 58585 నంబర్లలో సంప్రదించాలని హెడ్ కానిస్టేబుల్ రాజు సూచించారు.

బీఆర్‌ఎస్వీ నాయకుల అరెస్ట్



హసన్‌పర్తి / కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ బీఆర్‌ఎస్వీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్టేషన్‌ఘన్‌పూర్ పర్యటన నేపథ్యంలో విద్యార్థి నాయకులు జట్టి రాజేందర్, కొమురయ్య, దామోదర్‌ను శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీసు స్టేషన్‌లో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు డాక్టర్ బండి రజనీకుమార్, నాయకుడు రమేష్ సంఘీభావం తెలిపారు.

దళిత హక్కుల పోరాట సమితి సభ్యులు..

ఖిలా వరంగల్: కాంగ్రెస్ మేనిఫెస్టోలో దళితుల కోసం పేర్కొన్న హామీలను నెరవేర్చాలనే డిమాండ్‌తో ఆదివారం సీఎం కార్యక్రమానికి వెళ్తున్న క్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సంఘీ ఎలేందర్ తోపాటు సభ్యులను మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్ట్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి సభ్యుల వివరాలను సేకరించారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

అభివృద్ధి అంతంతే!



టేకులగూడెం గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా కానరాని డ్రెయినేజీలు

- కనీస సౌకర్యాలకు నోచుకోని టేకులగూడెం
- గ్రేటర్‌లో విలీనమయ్యాక మందగించిన అభివృద్ధి
- సైడ్ డ్రెయినేజీలు, రోడ్లు లేక ప్రజల ఇక్కట్లు
- దృష్టి సారించని అధికారులు, పాలకులు



సీసీ రోడ్డు లేని కాలనీ

మడికొండ: హనుమకొండ కాజీపేట మండలం కాజీపేట మండలం టేకులగూడెం గ్రామంలో అభివృద్ధి జరగడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల క్రితం గ్రేటర్ వరంగల్‌లో విలీనమైన టేకులగూడెంలో అభివృద్ధి మందగించిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పుడు గ్రేటర్ వరంగల్ పరిధిలోని 64వ డివిజన్‌లో విలీనమైంది. గ్రామంలో ఎప్పుడో 30ఏళ్ల క్రితం వేసిన రోడ్లు, సైడు కాలువలు ధ్వంసమయ్యాయి. వర్షాకాలంలో రోడ్లపై నడవడానికి సైతం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రేటర్‌లో విలీనమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని పలువురు పేర్కొన్నారు.

పదేళ్లుగా అభివృద్ధి లేదు



పదేళ్ల క్రితం గ్రేటర్‌లో టేకులగూడెం విలీనమైనప్పటి నుంచి గ్రామంలో అభివృద్ధి జరగలేదు. ముప్పై ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్లు, డ్రెయినేజీలు ధ్వంసమయ్యాయి. అభివృద్ధి చేయాలని విన్నవించినా 64వ డివిజన్ కార్పొరేటర్, స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదు. ఎన్నికలప్పుడు అనేక హామీలు ఇచ్చి ఆ తర్వాత కన్నెత్తి కూడా చూడడం లేదు. – తాటిరెడ్డి నరోత్తంరెడ్డి, గ్రామస్తుడు

కనీస సౌకర్యాలు లేవు



ప్రస్తుతం టేకులగూడెం గ్రామం 64వ డివిజన్‌లో ఉంది. మా గ్రామంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దాంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో నడవడానికి సైతం తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అభివృద్ధి పనులు చేపట్టాలి. – నర్ర రాజేందర్, స్థానికుడు



బాపూజీనగర్‌లో అధ్వానంగా ఉన్న రోడ్డు

బాపూజీనగర్‌లో రోడ్లు, డ్రెయినేజీలు అధ్వానం

- పట్టించుకోని అధికారులు, పాలకులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



గుంతలు పడిన రోడ్డు



ధ్వంసమైన సైడ్ డ్రెయినేజీ

కాజీపేట రూరల్: గ్రేటర్ వరంగల్ కాజీపేట 47వ డివిజన్ పరిధిలోని బాపూజీనగర్‌లో రోడ్లు, సైడ్ డ్రెయినేజీలు అధ్వానంగా తయారయ్యాయి. అనేక ఏళ్ల క్రితం వేసిన రోడ్లు ధ్వంసమై కంకర తేలి గుంతలు పడ్డాయి. బాపూజీనగర్ మెయిన్ రోడ్డు నుంచి పోచమ్మగుడికి వెళ్లే దారిలో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. దాంతో మురుగు నీరు ముందుకు వెళ్లడం లేదు. దుర్వాసనతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. వ్యర్థాల కారణంగా దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. సమస్యలు పరిష్కరించి, అభివృద్ధి చేయాలని కోరినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



బాపూజీనగర్‌లో పలు చోట్ల సీసీ రోడ్లు ధ్వంసమయ్యాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దాంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గుంతలు పడి, కంకర తేలిన రోడ్లపై వాహనదారులు, పాదచారులు ఇక్కట్లు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అభివృద్ధి పనులు చేపట్టాలి. – కొండ్ర నర్సింగరావు, స్థానికుడు

ఆ వైద్యులపై చర్యలు తీసుకోవాలి



వెన్నెలను పరామర్శిస్తున్న రత్నమాల

ఎంజీఎం / వరంగల్: నగరంలోని సీకేఎం ప్రసూతి ఆస్పత్రిలో ఈర్ల వెన్నెలకు వైద్యం చేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) వరంగల్ జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెన్నెలను ఆదివారం పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ నగరంలోని 14వ డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఈర్ల వెన్నెల ఈనెల 11న కాన్పు కోసం నగరంలోని సీకేఎం ప్రసూతి ఆస్పత్రిలో చేరగా మగబిడ్డకు జన్మనిచ్చిందని అన్నారు. వైద్యులు చిన్న ఆపరేషన్ చేసి కుట్లు వేసే సమయంలో శరీరం లోపల ప్యాడ్ ఉంచి ఇంటికి పంపించారని విమర్శించారు. దీంతో వెన్నెలకు తీవ్రంగా బ్లీడింగ్ కావడంతో పాటు యూరిన్, మోషన్ పూర్తిగా ఆగిపోయి తీవ్ర ఇబ్బంది పడి ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిందన్నారు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారని తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఈర్ల వెన్నెలకు నిర్లక్ష్యంగా చికిత్స చేసిన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బాధితురాలి ఆరోగ్యం మెరుగుపడే వరకు వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించాలని సూచించారు. ఈ విషయంపై కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి తక్షణమే స్పందించి బాధితురాలికి న్యాయం చేయాలని రత్నమాల కోరారు.

సీఎంకు స్వాగతం పలికిన మేయర్, కమిషనర్

వరంగల్ అర్బన్: సీఎం రేవంత్ రెడ్డిని స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం శివునిపల్లి హెలిప్యాడ్ వద్ద వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేలు ఆదివారం వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి ఆలయంపై భాగంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులు గండదీపం వద్ద పూజలు నిర్వహిస్తుండగా పక్కనే ఉన్న పిచ్చిమొక్కలకు అగ్గి అంటుకుంది. ఈక్రమంలో మంటలు చెలరేగడంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, దేవస్థాన చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి సంఘటన స్థలాన్ని చేరుకున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

గీసుకొండ: కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతరలో ఆదివారం తప్పిపోయిన బాలుడిని పోలీసులు తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ రంగశాయిపేటకు చెందిన కేడల సురేశ్ తన కుటుంబంతో జాతరకు వచ్చాడు. షాపింగ్ చేస్తున్న క్రమంలో ఆయన మూడేళ్ల కుమారుడు జస్విత్ చంద్ర తప్పిపోయాడు. తమ కుమారుడు తప్పిపోయాడని తల్లిదండ్రులు సమాచారం ఇవ్వడంతో గీసుకొండ సీఐ మహేందర్ వెంటనే స్పందించారు. ఎస్సై కుమార్‌తో ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి బాలుడి ఆచూకీ తెలుసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడి తల్లిదండ్రులు గీసుకొండ సీఐ, ఎస్సై, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఐదేళ్లుగా బాలుడి కోసం..

కొమ్మాల జాతరకు 2020 మార్చిలో రాజస్థాన్ రాష్ట్రంలోని అల్వాల్ జిల్లా రేణి గ్రామానికి చెందిన కొందరు ఆట వస్తువులు అమ్ముకోవడానికి వచ్చారు. వారిలో భగర్య ధర్మవీర్ – సీత దంపతుల కుమారుడు ప్రదీప్(6) జాతరలో ఆడుకుంటూ వెళ్లి తప్పిపోయాడు. అతడి ఆచూకీ కోసం పోలీస్‌శాఖ చేయని ప్రయత్నం లేదు. ప్రదీప్ ఆచూకీ నేటికీ లభించలేదు.

పొట్టి శ్రీరాములు ఆశయాలు ఆదర్శం



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రకాశ్‌రావు, తదితరులు

వరంగల్ చౌరస్తా: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వరంగల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు అన్నారు. వరంగల్ చౌరస్తాలోని వైశ్య భవన్‌లో వరంగల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 124వ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రకాశ్‌రావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రం కోసం నిరవధిక నిరాహార దీక్ష చేసి ప్రత్యేక రాష్ట్రం సాధించి అసువులు బాసిన మహానుభావుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. అనంతరం పబ్బతి నాగభూషణం – సునీత దంపతుల కుమార్తె పబ్బతి రోషిణి ఎంబీబీఎస్ అనంతరం హౌస్ సర్జన్ చదువు కోసం సంఘం నుంచి రూ.5 వేలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు మల్యాల వీర మల్లయ్య, గుండా మల్లికార్జున్, గన్ను సంపత్ కుమార్, గాదె వాసుదేవ్, ఎర్రం శ్రీనివాస్, ఇరుకుల్ల పాపారావు, శ్రీలతాదేవి, లావణ్య, ప్రవీణ, మౌనిక, మంజుల, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం ముచ్చర్లలోని జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థుల (2003 – 2004 ఎస్ఎస్‌సీ బ్యాచ్) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రెండు దశాబ్దాల తర్వాత విద్యార్థులు ఒకచోట కలుసుకుని గత స్మృతులను గుర్తుచేసుకున్నారు. రోజంతా సందడిగా గడిపారు. పరస్పరం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాటి గురువులు లక్ష్మీనర్సయ్య, పావుశెట్టి వెంకటేశం, బుచ్చమాచార్యులు, బి.జయపాల్ రెడ్డి, సుమతి, స్వామినాథ్, దేవేందర్, శ్రీదేవి, రజనీదేవిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్లు రాము, శివప్రసాద్, అజీజ్, సంతోష్, అపర్ణ, ప్రతిభ, అనిత, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ అమలు చేయకపోతే నష్టం

హన్మకొండ: ఎస్సీ వర్గీకరణ చేకుండా గ్రూప్ –1, 2, 3 నియామకాలు చేపడితే మాదిగలకు తీవ్ర నష్టం కలుగుతుందని కాకతీయ యూనివర్శిటీ బయో టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ పాడేటి శ్రీనివాస్ మాదిగ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూల తీర్పు ఇవ్వగా, తీర్పు వెలువడిన నాటికి జారీ చేసిన నోటిఫికేషన్లలోని ఉద్యోగాలకు కూడా ఎస్సీ వర్గీకరణ వర్తింపజేస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి చెప్పి ఇప్పుడు మాట తప్పుతున్నారని విమర్శించారు. ఈక్రమంలో మాదిగలంతా ఒక్కతాటిపైకి వచ్చి ప్రభుత్వంపై పోరాడాలని సూచించారు. మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద చిన్నరాజు మాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలో నాయకులు పాల్గొన్నారు.

ఇక కోతుల బెడదకు చెక్

- వానరాలను పట్టేందుకు బోను ఏర్పాటు
- ఐదు రోజులపాటు ఎల్లాపురంలో కోతులు పట్టే కార్యక్రమం
- స్థానికుల ఫిర్యాదు మేరకు స్పందించిన కార్పొరేటర్



కోతుల కోసం ఏర్పాటు చేసిన బోను

హసన్‌పర్తి: 65వ డివిజన్ ఎల్లాపురంలో ఇక కోతుల బెడద తీరనుంది. ఎల్లాపురంలోని ఆయా కాలనీల్లో కోతులు గుంపులుగా తిరుగుతూ నానా హంగామా సృష్టిస్తున్నాయి. వానరాల దాడుల వల్ల పలువురు గాయపడి ఆస్పత్రిలో చేరారు. వాటి బెడదతో ప్రజలు బయటికి వెళ్లాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. ఈక్రమంలో స్థానిక కార్పొరేటర్ దివ్యారాణి దృష్టికి సమస్యను కాలనీవాసులు తీసుకెళ్లారు. స్పందించిన కార్పొరేటర్ వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడారు. కోతుల బెడదను అరికట్టాలని వారికి సూచించారు.

గుట్ట వద్ద బోను ఏర్పాటు

కోతులను పట్టి తీసుకెళ్లడానికి బోను ఏర్పాటు చేశారు. స్థానిక గుట్ట వద్ద గుంపులుగా తిరుగుతున్న కోతులను పట్టుకోవడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. ఐదురోజుల పాటు ఇక్కడే కోతులను పట్టే కార్యక్రమం చేపడుతున్నట్లు కార్పొరేటర్ దివ్యారాణి తెలిపారు. పట్టిన కోతులను అడవుల్లో వదిలిపెట్టనున్నట్లు ఆమె వివరించారు.

ఎర్రగట్టు ఆలయాభివృద్ధికి కృషి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామివారిని ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ టీటీడీ దేవాలయం నుంచి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆలయాభివృద్ధికి దాతలు కూడా ముందుకు రావాలని కోరారు. అలాగే, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్ రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, ధర్మకర్తలు శీలం రమేష్, కనపర్తి రాజు, ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, శివరాం, దేవస్థాన మాజీ చైర్మన్ జె.రవి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో భక్తుల సందడి

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మూడో రోజు ఆదివారం భక్తులతో ఆలయం కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో విశ్వక్సేన సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. కార్యక్రమలో విశ్వక్సేన సేవా సమితి సభ్యులు శీలం పృథ్వీరాజ్, సట్కూరి సంతోష్, వెంకటేశం, కందుకూరి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి



కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వరంగల్ చౌరస్తా: అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై స్పీకర్‌కు ఆయన వెంటనే క్షమాపణ చేపట్టాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య డిమాండ్ చేశారు. కాంగ్రెస్ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తాలో ఆదివారం నిరసన తెలిపారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, మాజీ కార్పొరేటర్ తత్తరి లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

చిరునవ్వుతో సమాజ సేవ చేయాలి



రామకృష్ణమూర్తిని సన్మానిస్తున్న సభ్యులు

మడికొండ: మానవ సేవే మాధవ సేవగా భావిస్తూ ప్రతిఒక్కరూ చిరునవ్వుతో సేవ చేయాలని, సేవా భాగ్యం గొప్పవరంగా భావించాలని లయన్స్ అంతర్జాతీయ డైరెక్టర్ రామకృష్ణమూర్తి సూచించారు. మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన సదస్సును 320ఎఫ్ గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణమూర్తి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో 320ఎఫ్‌కు గొప్ప పేరుందని అన్నారు. జిల్లా గవర్నర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రిటెన్షన్లను మినహాయిస్తే 600 మంది కొత్త సభ్యులతో 6నూతన క్లబ్‌లతో లయనిస్టిక్‌ను విజయవంతం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, దీపక్, భట్టాచార్య, ఆవుల గోపాల్‌రావు, మాజీ చైర్మన్ ప్రొఫెసర్ వి.గోపాల్‌రెడ్డి, కన్నా పరశురాములు, కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ సుధాకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, లక్ష్మీనర్సింహరావు, జాన్‌బన్నీ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో ఉద్యోగావకాశాలు మెండు



ఎన్‌సీసీ శిక్షణకు ఎంపిక చేస్తున్న అధికారులు

ఖిలా వరంగల్: ఎన్‌సీసీ బీ, సీ సర్టిఫికెట్లతో కేడెట్లకు అధికంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని 10 టీజీఎన్‌సీసీ బెటాలియన్ కమాండెంట్ కల్నల్ రామదురై అన్నారు. వరంగల్ స్తంభంపెల్లిలోని ఏపీఎస్ లిటిల్ జెమ్స్ పబ్లిక్ స్కూల్‌లో ఎన్‌సీసీ హవల్దార్ ముగ్బుల్ బాషా, కుమార్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ అంకతి సాగర్ పర్యవేక్షణలో ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక ప్రక్రియను ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి పాఠశాల స్థాయి నుంచే ఎన్‌సీసీ శిక్షణ పొందాలని, శిక్షణతో స్నేహభావం, క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేందర్, చాంద్, రహీం, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డిని కలిసిన హౌజింగ్ బోర్డు వాసులు



ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న కాలనీవాసులు

హన్మకొండ: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని వరంగల్ మహానగర పాలక సంస్థ 51వ డివిజన్ హనుమకొండలోని హౌజింగ్ బోర్డు కాలనీవాసులు కలిశారు. హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి తమకు హౌజింగ్ బోర్డు అధికారులు నోటీసులు జారీ చేశారని సమస్యను వివరించారు. ఈ సదర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను సానుకూలంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని లక్ష్మారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు నాగరాజు, కాలనీవాసులు సత్యనారాయణ, శంకరయ్య, జయశంకర్, చిట్యాల సమ్మయ్య, కట్టంగూరు శ్రీనివాస్ రెడ్డి, నేరెళ్ల రంజిత్, వేల్పుల అనిల్ పాల్గొన్నారు.